ప్రతి తాలూకాలో కృషి సమాజ్ భవనాలు 9

● వ్యవసాయ శాఖ మంత్రి చలువరాయ
● రైతు శ్రేయస్సుపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ : ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి


# చిదంబర రహస్యం..!



● కాంగ్రెస్ నేతలతో సీనియర్ నాయకుడు చిదంబరం రహస్య భేటీ ● నాయకత్వ మార్పుపైనే చర్చలు.. ●సీఎం, డీసీఎం వర్గీయుల్లో టెన్షన్



బెంగళూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యంత రహస్యంగా రాజకీయం సాగుతోంది. నవంబరులో నాయకత్వ మార్పా కానీ క్యాబినెట్ ప్రక్షాళన కానీ జరుగుతుందా లేదా అనేది అంతుచిక్కని విషయంగా మారింది. రోజురోజుకు మలుపులు తిరుగుతున్న విధానాలపై కాంగ్రెస్ నాయకుల్లోనే గుబులు పట్టుకుంటోంది. నాయకత్వ మార్పు ఉండదని ఐదేళ్లు నేనే సీఎంగా ఉంటానని ప్రకటించిన సీఎం సిద్దరామయ్య మాటలు ఇటీవల మారిపోయాయి. అధిష్ఠానం ఆదేశిస్తే ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉంటానన్నారు. అంటే పరోక్షంగా అధిష్ఠానం ఏదైనా నిర్ణయం తీసుకోవచ్చుననే సంకేతం ఇచ్చారు. కానీ ముఖ్యమంత్రి పదవిని ఆశిస్తూ అదే జీవితాశయంగా రాజకీయాలు చేస్తున్న డీకే శివకుమార్ ఒక్కసారిగా యూటర్న్ తీసుకునేలా మాట్లాడారు. నవంబరు క్రాంతి, డిసెంబరు భ్రాంతి ఏదీ లేదని... పార్టీ అధిష్ఠానం నిర్ణయించే ఆదేశాలను పాటించే కార్యకర్తనన్నారు. బిహార్‌కు వెళ్లాలని సూచించారని, అందుకే వెళ్తున్నానంటూ ఢిల్లీలో ప్రకటించారు. మరోవైపు సీఎం సిద్దరామయ్య ఐదేళ్లు ఉంటారని ఎవరైనా మాట్లాడితే చాలు... విరుచుకుపడిపోయిన డీకే శివకుమార్ తమ్ముడు డీకే సురేశ్ దీనికి విరుద్ధంగా వ్యాఖ్యానించారు. సిద్దరామయ్యకు ఇంకా శక్తి ఉందని ఆయన సారథ్యంలోనే 2028 శాసనసభ ఎన్నికలకు వెళ్తామన్నారు. సాధారణంగా సిద్దరామయ్య వర్గీయులను వ్యతిరేకిస్తూ దాదాపు రెండేళ్లకు పైగా మాట్లాడిన డీకే సురేశ్‌లో మార్పు దేనికి సంకేతం అనేది అర్థం కాని పరిస్థితిగా ఉంది. ఇలా అందరూ తమ తీరులో మార్పు వచ్చినా అధిష్ఠానం మాత్రం ఆచితూచి వ్యవహరిస్తోంది. కాంగ్రెస్ అగ్రనేత చిదంబరం ఇటీవల బెంగళూరుకు వచ్చి అత్యంత రహస్యంగా పార్టీకి చెందిన పలువురు కీలకనేతలతో అభిప్రాయసేకరణ చేసినట్లు తెలుస్తోంది. అధిష్ఠానం సూచన మేరకు చిదంబరం ప్రక్రియ సాగించినట్లు తెలుస్తోంది. బెంగళూరులో వ్యక్తిగత పని ఉందని వచ్చిన చిదంబరం ఏకంగా నాలుగురోజులపాటు ఒక హోటల్‌లో బస చేశారు. అక్కడ సీనియర్ నేతలను రప్పించుకుని చర్చించినట్లు సమాచారం. ఇరువర్గాలకు చెందిన నేతలు పాల్గొన్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా రాష్ట్రంలో నాయకత్వ మార్పు జరిపితే పార్టీపై ఎటువంటి ప్రభావం పడనుందోనని, డీకే శివకుమార్‌కు కీలక పదవి ఇస్తే పాలనలో జరిగే మార్పులు, అందుకు ఎమ్మెల్యేల మద్దతు ఎలా ఉంటుందనే కోణంలో అభిప్రాయసేకరణ జరిగింది. మంత్రివర్గ విస్తరణ జరిపి సీనియర్లను పక్కనపెట్టి పార్టీలో అసంతృప్తి పెరగనుందా..? అది ఏ స్థాయిలో ఉంటుందని, ఎవరికి అనుకూలం కానుందనే కోణంలో వివరాలు సేకరించినట్లు తెలుస్తోంది. కేపీసీసీ అధ్యక్షుడిగా డీకే శివకుమార్‌ను కొనసాగించాలా... మార్పు చేయాలా..? అనే అంశం కూడా ఆరా తీసినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితిపై చిదంబరం సమగ్ర నివేదికను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.



### గుజరాత్ పాలసీకి డీకేశీ వర్గం పట్టు

రాజకీయం ఉత్కంఠగా సాగుతున్న తరుణంలోనే డీకే శివకుమార్ వర్గీయులు ఓ కొత్త ప్రతిపాదన చేసినట్లు తెలుస్తోంది. ఇటీవల గుజరాత్‌లో క్యాబినెట్‌కు చెందిన మంత్రులందరిచేత రాజీనామా చేయించి కొత్తవారికి అవకాశం ఇచ్చారు. రాష్ట్రంలో గుజరాత్ పాలసీ అమలు చేయాలనే డిమాండ్ పెరుగుతోంది. గుజరాత్‌లో ఈ విధానం జరిగినప్పటి నుంచే డిమాండ్ కొనసాగుతోంది.



రాష్ట్ర క్యాబినెట్‌లో సుమారు 10మందికి పైగా సీనియర్లు మంత్రులుగా కొనసాగుతున్నారు. 2013 - 18 మధ్య సిద్దరామయ్య ప్రభుత్వంతోపాటు 2018 నుంచి 2019 మధ్య ఏడాదిరన్న కాలం సంకీర్ణ ప్రభుత్వంలోనూ మంత్రులుగా కొనసాగిన వారు ఉన్నారు. వారందరినీ పక్కన పెట్టి కొత్తవారికి ఇస్తే వివాదం ఎక్కడి దాకా వెళ్తుందనేది కీలకం కానుంది.

## అధిష్ఠానం ఆదేశాలతో ఆగిన ఢిల్లీ పర్యటనలు

రాష్ట్రంలో రాజకీయంగా ప్రశాంతంగా ఉందని చెప్పలేని పరిస్థితి కొనసాగుతోంది. ఓ విధంగా ఉత్కంఠ పరిస్థితి ఉంది. దాదాపు రెండు నెలలుగా నవంబు క్రాంతి ప్రస్తావన సాగుతోంది. ప్రస్తుతం బిహార్ ఎన్నికలు ఉండడంతో అవి ముగిశాకే మార్పులు అంటూ తేల్చేశారు. స్వయానా సీఎం సిద్దరామయ్య కూడా ఈనెల 14వ తేదీ తర్వాత ఢిల్లీ వెళ్తానని, రెండు మూడురోజులపాటు అక్కడే ఉంటానని ప్రకటించారు. మంత్రివర్గ విస్తరణ అంశం అధిష్ఠానంతో చర్చిస్తానని, ప్రత్యేకంగా రాహుల్‌గాంధీతో కలుస్తానని ప్రకటించారు. ఇదంతా బాగానే ఉన్నా అసలు విషయం తాజాగా బయటకు వచ్చింది. బిహార్ ఎన్నికల ఫలితాలు ఈనెల 14న వెలువడనున్నాయి. అదే రోజున రాహుల్‌గాంధీ విదేశాలకు వెళ్తున్నారు. సుమారు వారం రోజులకుపైగా ఆయన విదేశాలలోనే ఉంటారు. సీఎం సిద్దరామయ్య ఢిల్లీ వెళ్లినా ఎటువంటి కీలక అంశాలు చర్చించే అవకాశం ఉండదనేది స్పష్టం అవుతోంది. రాహుల్‌గాంధీ నిర్ణయం లేకుండా ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే కూడా ఎలాంటి తీర్మానాలు అవకాశం ఉండదు. దీన్నిబట్టి నవంబరు క్రాంతి డిసెంబరుకు మారనుందా అనేది చర్చనీయాంశమైంది.



విధానసౌధ వద్ద కనకదాసకు నివాళి అర్పిస్తున్న సీఎం సిద్దరామయ్య

## కనకదాస భక్తుడే కాదు.. దార్శనికుడు

బెంగళూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కనకదాస కేవలం భక్తుడు మాత్రమే కాదని ఓ దార్శనిక వ్యక్తిగా రాణించారని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. కనకజయంతిని పురస్కరించుకుని శాసకర భవన ప్రాంగణంలో శనివారం కనకదాసు విగ్రహానికి పూలమాల సమర్పించారు. ఇదే సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కనకదాసు జయంతిని ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తోందన్నారు. సమాజంలో మార్పుకోసం కీర్తనల ద్వారా కనకదాసు ప్రయత్నించారన్నారు. శ్రీకృష్ణుడికి పరమభక్తుడని, ఉడుపిలో కనకనకిండి నిర్మాణానికి కారకులన్నారు. కనకదాసు ఆశయాలు, సాధనలు నేటి యువతరం తెలుసుకోవాలన్నారు. కురుబ కులంలో పుట్టినా విశ్వమానవుడిగా కనకదాసు రాణించారన్నారు. కోలారులో జరిగిన కార్యక్రమంలో సీఎం మీడియా సలహాదారుడు కేవీ ప్రభాకర్ మాట్లాడుతూ (మిగతా 7వ పేజీలో)

## సాహిత్యం ఓ పరిశ్రమగా మారుతోంది

● శివప్రకాశ్ అసహనం ● ఇకపై స్టార్ హోటళ్లలో సాహితీ సభలకు వెళ్లేది లేదన్న సాహితీవేత్త ● నగరంలో సమాజముఖి సాహిత్య సమ్మేళనం ప్రారంభం




ప్రసంగిస్తున్న సాహితీవేత్త హంప నాగరాజయ్య, వేదికపై శివప్రకాశ్, బరగూరు రామచంద్రప్ప

బెంగళూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సాహిత్యం ఓ పరిశ్రమగా మారిపోతోందని ఇది సమాజానికి పెను ముప్పు అని ప్రముఖ సాహితీవేత్త హెచ్‌ఎస్ శివప్రకాశ్ అన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంగణంలో శనివారం సమాజముఖి సాహిత్యసమ్మేళనం లాంఛనంగా ప్రారంభించారు. ప్రముఖ సాహితీవేత్తలు హంప నాగరాజయ్య, బరగూరు రామచంద్రప్ప, హెచ్‌ఆర్ సుజాతలు ముఖ్యులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివప్రకాశ్ మాట్లాడుతూ సాహిత్యరంగం పారిశ్రామికమైతే పరిణామాలు సమంజసంగా ఉండవన్నారు. ఇటీవలే లండన్‌లో ఓ ఏజెన్సీ సాహితీవేత్తలను పురస్కారాలకు ఎంపిక చేసిన అంశాన్ని ప్రస్తావించారు. సాహిత్యం కార్పొరేట్ రంగం కారాదన్నారు. ఇకపై స్టార్ హోటళ్లలో సాహితీసభలు జరిగితే పాల్గొనేది లేదని ప్రకటించారు. హంప నాగరాజయ్య మాట్లాడుతూ కేంద్రం ప్రాంతీయభాషలకు ప్రాధాన్యం ఇవ్వకుండా సంస్కృతం, హిందీలను ప్రోత్సహించేదిశగా వ్యవహరించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవలి 11ఏళ్లలో సంస్కృత భాషకు కేంద్రం 2,532.59 కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని, ద్రవిడభాషలైన తమిళకు రూ.113 కోట్లు, తెలుగుకు 12.65 కోట్లు, కన్నడకు 12.28 కోట్లు, మలయాళంకు 4.52 కోట్లు ఖర్చు చేసిందన్నారు. 29కోట్ల మంది మాట్లాడే కన్నడ భాషకు గ్రాంట్ల విషయంలో అన్యాయం చేయడం సరికాదన్నారు. దేశంలో 14 సంస్కృత విశ్వవిద్యాలయాలు ఉన్నాయని, కానీ సంస్కృతభాషతో సమానంగా ప్రాచీనత కల్గిన ఇతర ఏ భాషలకు విశ్వవిద్యాలయాలు లేవన్నారు. బంగ్లాదేశ్, నేపాల్‌లలో జనచైతన్యం ఎలా వచ్చిందనేది పరిశీలించుకోవాలన్నారు. ఐదు వేదికల ద్వారా సాహిత్య సదస్సులు జరిగాయి.


## జపాన్ కంపెనీలకు 300 ఎకరాల భూమి : మంత్రి

బెంగళూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జపాన్ దేశ కంపెనీల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం 300 ఎకరాలు కేటాయించిందని రాష్ట్ర భారీ పరిశ్రమలశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సెల్వకుమార్ తెలిపారు. తుమకూరులో జపనీస్ టౌన్‌షిప్ ప్రాజెక్టును ప్రారంభించేందుకు కోరారన్నారు. అందుకు అవసరమైన సౌలభ్యాలను కల్పిస్తున్నట్టు తెలిపారు. జపాన్ కంపెనీలకు రాష్ట్రం సంపూర్ణ సహకారం ఇవ్వనుందన్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు అనుకూలం కోసం కేటాయించామన్నారు. బెంగళూరులో ఐటీతోపాటు ఇతర రంగాల పరిశ్రమలకు అనుకూలమైన వాతావరణం ఉన్నందున జపాన్ పారిశ్రామికవేత్తలు కోరారన్నారు.

మొక్కజొన్నను రూ.3వేల మద్దతు ధరతో కొనుగోలు చేయాలి
● ఏఐకేకేఎంఎస్ డిమాండ్ 9

డీకేశీ సీఎం కావాలని అమృతేశ్వర ఆలయంలో పూజలు

## ఆస్తులు వెల్లడించని అమాత్యులు



● జాబితాలో ఐదుగురు మంత్రులు సహా 96 మంది ఎమ్మెల్యేలు ● చర్యలపై లోకాయుక్త మౌనం

బెంగళూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏటా ఎమ్మెల్యేలు తమ ఆర్థిక లావాదేవీలను లోకాయుక్తకు తప్పనిసరిగా అందజేయాలన్న నిబంధనను ఇటీవల కొందరు సభ్యులు గాలికొదిలేశారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఎవరైనా ఏడాదికోసారి తప్పనిసరిగా వివరాలను లోకాయుక్తకు అందజేయడం తప్పనిసరి నిబంధన. జూన్ నెలాఖరులోగా వారి ఆర్థిక వ్యవహారాలను అందజేయాల్సి ఉంది. కానీ రాష్ట్రంలో ఈసారి ఏకంగా ఐదుగురు మంత్రులతోపాటు 67మంది ఎమ్మెల్యేలు 29మంది ఎమ్మెల్సీల వార్షిక ఆస్తులు, ఆర్థిక లావాదేవీల సమాచారాన్ని అంజేయలేదు. ప్రభుత్వ ఉద్యోగులే కాకుండా ప్రజాప్రతినిధులు కూడా జూన్ ఆఖరుకు ముందు ఏటా తమ, కుటుంబ సభ్యుల వివరాలను ఓ నివేదిక రూపంలో లోకాయుక్తకు అందజేయాల్సి ఉంది. ఆస్తుల వివరాలు ప్రకటించని శాసనసభ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు లోకాయుక్తకు వెసలుబాటు ఉంది. కానీ ఇటీవలకాలంలో నిర్లక్ష్యం చేసిన శాసనసభ్యులపై లోకాయుక్త చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. దీంతో అడిగేవారు లేరని, నేతలు మరింత నిర్లక్ష్యం చేస్తున్నారు.

### సీనియర్ మంత్రులదీ అదే తీరు...

సుదీర్ఘ రాజకీయ అనుభవం కల్గి కేంద్రంలోనూ ఏళ్ల తరబడి మంత్రిగా కొనసాగిన రాష్ట్ర పౌర ఆహార సరఫరాలశాఖ మంత్రి కేహెచ్ మునియప్ప, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు, వసతి, వక్ఫ్, మైనారిటీ శాఖల మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్, నగరపాలన, హజ్‌శాఖల మంత్రి రహీంఖాన్, పశుసంవర్ధకశాఖ మంత్రి కే వెంకటేశ్ ఆస్తుల వివరాలు ఇంతవరకు అందజేయలేదు. ఎమ్మెల్సీలు 25మంది, 67 మంది ఎమ్మెల్యేలు సైతం ఇదే జాబితాలో ఉన్నారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన హెచ్‌వై మేటీ కూడా ఆస్తుల ప్రకటించని వారిలో ఉన్నారు. దాదాపు రెండేళ్లకుపైగా మంత్రిగా కొనసాగిన కేఎన్ రాజణ్ణ, సీనియర్ సభ్యులు అశోక్‌పట్టణ, విజయానంద కాశప్పనవర్, జనార్ధనరెడ్డి, బసవరాజరాయరెడ్డి, వినయ కులకర్ణి, సతీశ్‌శైల్, జేఎన్ గణేశ్, ఎన్‌వై గోపాలకృష్ణ, పుట్టస్వామిగౌడ, సుబ్బారెడ్డి, వెంకటశివారెడ్డి, రూపకళ, గోపాలయ్య, శివణ్ణ, సీపీ యోగేశ్వర్, దర్శన్ పుట్టణ్ణయ్య, సీఎన్ బాలకృష్ణ, హెచ్‌డీ రేవణ్ణ, ఏ మంజు, పుట్టరంగశెట్టి వంటివారు ఇందులో ఉన్నారు. ఎమ్మెల్సీల్లో హెచ్ విశ్వనాథ్, అబ్దుల్ జబ్బార్, బసనగౌడ బాదర్లి, గోవిందరాజు, ఐవాన్ డిసౌజ, ఎంటీబీ నాగరాజు, ప్రదీప్‌శెట్టర్, రాజేంద్రరాజణ్ణ, సుశీల్‌నమోశి, ఎస్‌వీ సంకనూరు, సునిల్‌గౌడ, శరవణ, సూరజ్ రేవణ్ణ ప్రకటించని వారిలో ఉన్నారు.

## బంగారు గొలుసు కోసం వృద్ధురాలి హత్య

● మృతదేహాన్ని గోనె సంచిలో ఉంచి రెండు రోజులు ఇంట్లోనే
● దుర్వాసన రావడంతో చెరువులో పడేసిన మహిళ
● పోలీసుల విచారణలో నేరం అంగీకరించిన నిందితురాలు

దొమ్మసంద్ర, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలి హత్య కేసును పోలీసులు ఛేదించారు. విచారణలో నిందితురాలు బంగారు గొలుసు కోసమే హతమార్చినట్లు అంగీకరించింది. సర్జాపుర సమీపంలోని కూగూరు వద్ద వృద్ధురాలి హత్య అంశం పోలీసులు ఛేదించి నిందితురాలిని సర్జాపుర పోలీసులు అరెస్టు చేశారు. సినీ ఫక్కీలో జరిగిన దారుణఘటన శనివారం వెలుగుచూసింది. కూగూరు నివాసి భద్రమ్మ (68)ను పొరుగింటికి చెందిన దీపా అనే మహిళ హతమార్చింది. పోలీసులు వెల్లడించిన ప్రకారం అక్టోబరు 30న మధ్యాహ్నం (మిగతా 7వ పేజీలో)



భద్రమ్మ (ఫైల్)

## ఓటు చౌర్యంపై కోటి సంతకాలు

● రేపు ఢిల్లీకి సంతకాల కాగితాలు ● రాజ్యాంగ విలువల కోసమే మా పోరాటం : సీఎం



కేపీసీసీ కార్యాలయంలో సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్, పార్టీ నాయకులు

బెంగళూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ చేపట్టిన ఓటుచౌర్యంపై పోరాటానికి రాష్ట్రంలో పూర్తి మద్దతు లభిస్తోందని, ఇప్పటికే కోటికి పైగా సంతకాల సేకరణ పూర్తయ్యిందని సీఎం సిద్దరామయ్య అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొన్ని వారాలపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్యనేతలు ప్రాంతాలవారీగా సేకరించిన సంతకాల వివరాలను ఆయన ప్రకటించారు. కేపీసీసీ కార్యాలయంలో శనివారం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌తోపాటు మంత్రి, ముఖ్యనేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మీడియాతో మాట్లాడుతూ ఓటు చౌర్యంపై కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తోందన్నారు. బీజేపీ అబద్ధాలు చెప్పడం మాత్రమే కాదని ఓటుచౌర్యంలోనూ నిష్ణావంతులని తేలిందన్నారు. మేం ఈ పరిణామాన్ని సహించేది లేదన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, నైతికతను కాపాడేందుకు పోరాట మార్గాన్ని కొనసాగిస్తామన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ బాధ్యతలు చేపట్టాక రాజ్యాంగబద్ధ సంస్థల విలువలు దెబ్బతిన్నాయన్నారు. సీబీఐ, ఈడీ, ఐటీ తరహాలోనే ఎన్నికల కమిషన్ కూడా కేంద్రం చేతిలో కీలుబొమ్మగా మారిందన్నారు. బీజేపీ ఓటుచౌర్యం ద్వారా శాసనసభ, లోక్‌సభల్లో అధికారానికి వచ్చినట్టు స్పష్టంగా రుజువైందన్నారు. రాహుల్‌గాంధీ నిరంతరం అధ్యయనం చేసి ఓటు చౌర్యంనకు సంబంధించి ఆధారాలతో దేశ ప్రజలకు వివరించారన్నారు. రాజ్యాంగ వ్యతిరేకంగా అధికారంలోకి రావడం ద్రోహమన్నారు. ప్రజాప్రభుత్వానికి జరిగిన వంచనను దేశమంతటా ప్రచారం చేస్తున్నామన్నారు. ఇంత జరుగుతున్నా ఎన్నికల కమిషన్ మా ప్రశ్నలకు సమాధానం చెప్పడం లేదన్నారు. దేశ ప్రజలకు ఆధారాలు చూపుతున్నా ఎందుకు స్పందించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషన్ స్వతంత్రసంస్థగా అంబేడ్కర్ రాజ్యాంగంలో పొందుపరిచారన్నారు. ఎన్నికలలో ప్రభుత్వాలు జోక్యం చేసుకోరాదని స్పష్టంగా ఉందన్నారు. ఇదే సందర్భంగా డీసీఎం, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు డీకే శివకుమార్ మాట్లాడుతూ ఓటు చౌర్యానికి సంబంధించి రాష్ట్రంలో 1,12,40,000 సంతకాలు సేకరించామన్నారు. ఓటుచౌర్యంలో ఎన్నికల కమిషన్ భాగస్వామ్యమైందన్నారు. రాష్ట్రంలో, దేశంలో జరుగుతున్న చౌర్యానికి సంబంధించి ప్రజా చైతన్యంలో భాగంగా సేకరించిన సంతకాల వివరాలను ఈనెల 10న ఢిల్లీకి పంపుతామన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో 40 జిల్లాలుగా విభజించుకుని సంతకాలు సేకరించామన్నారు. కార్యకర్తలు నిష్పక్షపాతంగా ప్రక్రియను కొనసాగించారన్నారు. ఓ పది ప్రాంతాలను మినహాయిస్తే రాష్ట్రమంతటా ప్రక్రియ కొనసాగిందన్నారు. బాధ్యతాయుతంగా పనిచేసిన జిల్లా అధ్యక్షులతో కలసి సంతకాల కాగితాలను ఢిల్లీకి పంపుతామన్నారు. ఈనెల 25న ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో జరిగే ప్రత్యేకసభలో వీటిని పార్టీ అగ్రనేతలకు సమర్పిస్తామన్నారు. మరో మూడు రోజులు సంతకాలు సేకరించని ప్రాంతాలలోనూ కొనసాగిస్తామన్నారు. బ్యాలెట్ ద్వారా పాలికె ఎన్నికలు జరపాలని భావిస్తున్నామన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య మనుగడకు రాహుల్‌గాంధీ నేతృత్వంలో పోరాటం చేస్తున్నామన్నారు. కలబురగి జిల్లా అలందలో ఓటు చౌర్యంకు సంబంధించి త్వరలోనే నివేదిక వెలువరిస్తామన్నారు. కార్యక్రమంలో మంత్రి సతీశ్‌జార్కిహొళితోపాటు కేపీసీసీ కార్యాధ్యక్షుడు చంద్రశేఖర్, పరిషత్ విప్ సలీం అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.




వెయ్.. చిందెయ్..

చిన్నారిని పలకరిస్తూ..

ప్రసంగిస్తున్న లోకేశ్

అందరికీ నమస్కారం..

లోకేశ్‌కు జ్ఞాపిక..



సెల్ఫీ...



మహిళా కార్యకర్త చిందులు..

# కురుబలను గుండెల్లో పెట్టుకుంటాం

కళ్యాణదుర్గం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి అండగా నిలిచిన కురుబలను మరువబోమని, వారిని గుండెల్లో పెట్టుకుని చూసుకుంటామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. కళ్యాణదుర్గంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఏర్పాటు చేసిన తొమ్మిది అడుగుల భక్త కనకదాస కాంస్య విగ్రహాన్ని శనివారం ఆయన ఆవిష్కరించారు. పట్టణంలోని హిందూపురం రింగ్ రోడ్డు వద్ద అశేష జనవాహిని మధ్య ఈ కార్యక్రమం జరిగింది. విగ్రహావిష్కరణ అనంతరం ఆ ప్రాంతానికి కనకదాస సర్కిల్‌గా మంత్రి నారా లోకేశ్ నామకరణం చేశారు. అంతకుముందు పట్టణంలోని ప్రజావేదిక నుంచి కనకదాస సర్కిల్ వరకు వందలాది మంది కురుబ కులస్థులు, అభిమానులు, ప్రజలతో కలిసి మంత్రి నారా లోకేశ్ ర్యాలీగా వచ్చారు. ఈ సందర్భంగా మహిళలు కలశాలు చేపట్టి రాగా, గొరవయ్యల ఆటపాటలు, కాంతార నృత్యాలు అక్కడున్న ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. విగ్రహావిష్కరణ అనంతరం మంత్రి మంత్రి లోకేశ్ మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీలు అన్ని విధాలుగా టీడీపీకి అండగా నిలిచారన్నారు. ఇప్పుడు మేము బీసీలను బలోపేతం చేయడానికి అన్ని విధాలా కృషి చేస్తున్నామన్నారు. మహాభక్తుడు కనకదాస జయంతిని రాష్ట్ర పండుగగా జరుపుకోవడం, విగ్రహావిష్కరణ చేయడం జీవితంలో మరచిపోలేనన్నారు. కురుబ సోదరులతో కలిసి జయంతి వేడుకలు జరుపుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు వెల్లడించారు.

## రుణపడి ఉంటాం

ఉమ్మడి జిల్లాకు ఎప్పుడూ రుణపడి ఉంటామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. దివంగత ఎన్టీఆర్‌ను మూడు సార్లు, మా మేనమామలు నందమూరి హరికృష్ణను ఒకసారి, బాలకృష్ణను మూడుసార్లు గెలిపించి అసెంబ్లీకి పంపిన గొప్ప నేల ఉమ్మడి అనంతపురం జిల్లా అన్నారు. ఈ నేలకు మేము ఎంత చేసినా తక్కువేనని, మా జీవితాంతం మీకు రుణపడి వుంటామన్నారు. ఈ ప్రాంత సమస్యలను పరిష్కరించేందుకు అహర్నిశలూ కృషి చేస్తామన్నారు. ఈ క్రమంలోనే జిల్లా ప్రజల అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్న ఆర్డీటీ సంస్థకు కూడా కేంద్రంతో మాట్లాడి ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించినట్లు వెల్లడించారు.

## కరువు సీమలో కార్ల పంట

కరువు సీమగా పేరు గడించిన ఉమ్మడి జిల్లాలో కార్ల పంట పండించిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదేనన్నారు. నిరుద్యోగ యువతకు పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమలు తెస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలో హార్టికల్చర్‌కు సాయం అందిస్తామన్నారు. తలసరి ఆదాయంలో 5వ స్థానంలో ఉన్న ఉమ్మడి జిల్లాను మూడో స్థానంలోకి తీసుకువస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. టీడీపీతోనే బీసీలకు రాజకీయ స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. 3132 కిలోమీటర్ల యువగళం పాదయాత్ర చేసినప్పుడు అన్ని కులాలకు సంబంధించిన సమస్యలను నేరుగా తెలుసుకున్నానని, వాటిని పరిష్కరించేంత వరకు విశ్రమించనని తెలిపారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత చెప్పిన పనులన్నీ పూర్తయ్యేవరకు వదిలిపెట్టరని, ఆమె పట్టుదల వల్ల బీసీల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఎంపీ బీకే పార్థసారధి కేంద్రంతో మాట్లాడుతూ నిధులు తీసుకువచ్చేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. కేంద్రం నుంచి రావాల్సిన సంక్షేమ పథకాలకు కురుబలకు అనుసంధానం చేసి అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో మంత్రులు పయ్యావుల కేశవ్, సవిత, ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, పార్థసారధి, కర్నూలు ఎంపీ నాగరాజు, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు గుమ్మనూరు జయరాం, బండారు శ్రావణి, పల్లె సింధూరరెడ్డి, ఎంఎస్ రాజు, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, కందికుంట వెంకట ప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, కలెక్టర్ ఆనంద్, రాష్ట్ర బీసీ వెల్ఫేర్ శాఖ ఎక్స్ ఆఫీషియో సెక్రెటరీ సత్యనారాయణ, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ దేవేంద్రప్ప, కడప రీజనల్ ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ పూలనాగరాజు, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, బీసీ వెల్ఫేర్ అడిషనల్ డైరెక్టర్ చంద్రశేఖర్ రాజు, బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూ కొఠారి, బీసీ కార్పొరేషన్ ఏడీ రామసుబ్బారెడ్డి, ఆయా శాఖల అధికారులు, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

- కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించి న్యాయం చేయాలని ఏపీ కాంట్రాక్ట్ లెక్చరర్స్ జేఏసీ ప్రతినిధులు మంత్రికి విజ్ఞప్తి చేశారు.
- కళ్యాణదుర్గం మండలంలోని మౌక్తికాపురంలో ముస్లిం మైనార్టీల శ్మశానాన్ని ఆక్రమించిన ముద్దినాయనపల్లికి చెందిన అశోక్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు మంత్రి నారా లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు.
- శ్రీ సత్యసాయి వాటర్ సప్లై ప్రాజెక్టులో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిబ్బంది మంత్రి లోకేశ్‌ను కలిసి కోరారు. ఆయా విజ్ఞప్తులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

### నీతి, నిజాయతీలకు మారుపేరు కురుబలు: మంత్రి సవిత



సభలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత మాట్లాడుతూ వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి బీసీలంతా అండగా నిలవాలని పిలుపునిచ్చారు. అన్న ఎన్టీఆర్ స్ఫూర్తితో బీసీల పక్షపాతిగా పనిచేస్తున్న మంత్రి నారా లోకేశ్‌కు అభినందనలు తెలిపారు. కురుబ కులస్థులు నీతి, నిజాయతీకు మారుపేరుగా నిలిచారన్నారు. రాయలసీమలో అధికంగా ఉన్న కురుబ కులస్థులను గుర్తించి వారి ఆరాధ్య దైవం భక్త కనకదాస జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే సురేంద్ర బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కనకదాస విగ్రహాన్ని మంత్రి లోకేశ్ చేతులమీదుగా విష్కరించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు కురుబలకు పెద్దపీట వేస్తున్నారని, ఈక్రమంలోనే గొర్రెలకు త్వరలోనే ప్రభుత్వం నుంచి బీమా వర్తింపజేయనున్నట్లు తెలిపారు. ఆదరణ-1, ఆదరణ-2 తెచ్చింది చంద్రబాబునాయుడేనని ప్రశంసించారు.

### బీసీ భవన్ మంజూరు చేయాలి: ఎంపీ బీకే పార్థసారధి



అనంతరం హిందూపురం ఎంపీ బీకే పార్థసారధి మాట్లాడుతూ భక్త కనకదాస 538వ జయంతి వేడుకలను యువనేత మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలో రాష్ట్ర పండుగగా జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. బీసీలకు 2024లో రెండు లోక్‌సభ, శాసనసభ పదవులిచ్చారన్నారు. భవిష్యత్తులో మరింతమందికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుగా అవకాశం ఇవ్వాలని కోరారు. ఎన్టీఆర్ హయాం నుంచి కురుబలను ఆదుకున్న పార్టీ టీడీపీనేనన్నారు. కుప్పంలో రూ. 5 కోట్లతో బీసీలకు కల్యాణ మండపాన్ని నిర్మించారన్నారు. ఉమ్మడి జిల్లాలో తొమ్మిది కల్యాణ మండపాలు నిర్మించుకున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలో బీసీ భవన్‌లను మంజూరు చేయాలని కోరారు.



ర్యాలీలో మంత్రి పయ్యావుల, ఎంపీ అంబికా, ఎమ్మెల్యే దగ్గుపాటి, జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

## విన్నపాలు వినవలె..!



కళ్యాణదుర్గం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తన రెండు రోజుల పర్యటనలో భాగంగా మంత్రి లోకేశ్ శనివారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ప్రజాదర్బార్ నిర్వహించారు. తనను కలిసేందుకు వచ్చిన ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించారు. వివిధ సమస్యలపై ప్రజలు, కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించారు.

- బతుకుదెరువు కోసం మస్కట్ వెళ్లిన తన సోదరి షేక్ జుబేదా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని, సరైన తిండి లేక అనారోగ్యం పాలైన ఆమెను క్షేమంగా స్వదేశానికి రప్పించేలా చర్యలు తీసుకోవాలని గుంతకల్లుకు చెందిన షేక్ షబానా మంత్రికి విన్నవించారు.
- తన ఇద్దరు కుమార్తెల ఉన్నత చదువుల కోసం ఆర్థిక సాయం అందించాలని అనంతపురంకు చెందిన మదమంచి ప్రవీణ్ కుమార్ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి కోరారు.




వృద్ధులు, మహిళల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి లోకేశ్



కళాకారుల ప్రదర్శన

### బీటీపీ కాలువ పనులు పూర్తి చేయండి: ఎమ్మెల్యే అమిలినేని

బీటీపీ(భైరవానితిప్ప ప్రాజెక్టు) కాలువ పనులు పూర్తి చేసి, రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మంత్రి నారా లోకేశ్‌కు శనివారం విన్నవించారు. దీనికి కనకదాస జయంతి సభలోనే మంత్రి లోకేశ్ స్పందించారు. బీటీపీ కాలువ పనులకు శంకుస్థాపన చేసింది టీడీపీ హయాంలోనేనని, ఇప్పుడు పూర్తి చేసేది కూడా మన ప్రభుత్వమే అని పేర్కొన్నారు. దీంతో సభలో హర్షధ్వానాలు మార్మోగాయి. సభలో ఎమ్మెల్యే అమిలినేని మాట్లాడుతూ అత్యంత వెనుకబడిన కళ్యాణదుర్గం నియోజకవర్గంలో మంత్రి లోకేశ్ రెండు రోజుల పర్యటన చేపట్టడం సంతోషకరంగా ఉందన్నారు. తాము పిలిచిన వెంటనే కళ్యాణదుర్గంలో తొమ్మిది అడుగుల కనకదాస కాంస్య విగ్రహావిష్కరణకు మంత్రి నారా లోకేశ్ విచ్చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కురుబ కులస్థుల మనసు పాల వంటి స్వచ్ఛమైనదని, వారి అభివృద్ధికి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

## మంత్రి నారా లోకేశ్‌కు వినతుల వెల్లువ



మంత్రికి వినతిప్రతం ఇస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

అనంతపురం క్రైం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధుల నుంచి వినతులు వెల్లువెత్తాయి. కళ్యాణదుర్గానికి వచ్చిన ఆయనను శనివారం కళ్యాణదుర్గం, పుట్టపర్తి ఎయిర్‌పోర్టులో నేతలు కలిసి సమస్యలు విన్నవించారు. విప్ కాలవ శ్రీనివాసులు, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మంత్రిని పుట్టపర్తి ఎయిర్‌పోర్టులో కలిశారు. వాల్మీకి బోయలను ఎస్టీల జాబితాలో చేర్చే ప్రక్రియ వేగవంతమయ్యేలా చూడాలని కోరారు. 2016లోనే చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రొఫెసర్ సత్యపాల్ ఏకసభ్య కమిషన్‌ను నియమించి ఈ సమస్యపై సమగ్రంగా అధ్యయనం చేయించిందన్నారు. ఆ కమిటీ ఏపీలో పర్యటించి బోయలను ఎస్టీల్లో చేర్చేలా సిఫార్సు చేసిందన్నారు. 2017లో అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపినట్టు తెలిపారు. వాల్మీకి బోయ సమాజ పరిస్థితిపై సానుకూల దృక్పథంతో ఆలోచించి కేంద్రం వ్యక్తం చేసిన ఆరు అంశాలపై త్వరితగతిని అధికారుల ద్వారా కేంద్రానికి నివేదిక అందేలా చూడాలని మంత్రికి వినతిపత్రం అందించారు.

### ఆర్డీటీకి హామీపై కృతజ్ఞతలు

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ రెన్యువల్ కోసం కృషి చేసిన మంత్రి నారా లోకేశ్‌కు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. కళ్యాణదుర్గంలో మంత్రి నారా లోకేశ్‌ను సహచర ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే దగ్గుపాటి కలిశారు. కనదాస విగ్రహావిష్కరణ తర్వాత ఆయన మంత్రి లోకేశ్‌తో మాట్లాడారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ సమస్య తీవ్రంగా ఉన్న సమయంలో మంత్రి లోకేశ్ చొరవ చూపారన్నారు. ఆ సంస్థకు రెన్యువల్‌కు హామీతోపాటు, మరింత ప్రోత్సాహకం ఇస్తామని చెప్పడం సంతోషకరమన్నారు. ప్రభుత్వం సేవ చేసేవారికి, పేదల పక్షాన నిలబడుతుందని చెప్పడానికి ఈ సంఘటనే ఉదాహరణ అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి లోకేశ్‌తో ఉమ్మడి జిల్లా ప్రజా ప్రతినిధులు

---

## తిరుమలలో కనకదాస పీఠం : మంత్రి సవిత



మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కురుబల ఆరాధ్య దైవం భక్త కనకదాస పీఠాన్ని తిరుమలలో ఏర్పాటు చేస్తామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. కనకదాస 538వ జయంతిని పురస్కరించుకుని పెనుకొండలోని మిట్ట ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న కనకదాస విగ్రహానికి ఆమె శనివారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కురుబలకు, బీసీలకు ఆదరణ -3 లబ్ధి త్వరలో చేకూరుతుందని అన్నారు. కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, శ్రీనివాసులు, బీజేపీ రామక్రిష్ణ, రఘువీరచౌదరి, శ్రీరాములు, బాబుల్‌రెడ్డి, రవీ, కృష్ణమూర్తి, అరుణ్‌రెడ్డి, షౌకత్, రమణమ్మ, బేబి, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతి నిలయంలో అఖండ భజన ప్రారంభం



అలంకరణలో బాబా మహాసమాధి



అఖండ భజనలో భక్తులు

పుట్టపర్తి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ హాలులో శనివారం సాయంత్రం 6 గంటలకు అఖండ భజన ప్రారంభమయింది. సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం విద్యార్థులు వేద పఠనంతో అఖండ భజన ప్రారంభమైంది. సత్యసాయి ప్రేమతత్వంపై భక్తి పాటలు ఆలనాపాలన చేపట్టారు. శ్రీసత్యసాయి శతజయంతి వేడుకలకు ముందస్తుగా శనివారం అఖండ భజన చేపట్టారు. అఖండ భజన 24 గంటల పాటు ఏకధాటిగా సాగి ఆదివారం సాయంత్రం 6 గంటలకు మంగళహారతితో ముగుస్తుంది. మొదటి రోజు అఖండ భజనలో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

## మెరుగు దిద్దేదెవరు..?

కదిరి అర్బన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): బంగారు ఆభరణాల తయారీలో కార్పొరేట్ కల్చర్ పెరిగిపోవడంతో స్థానిక స్వర్ణకారుల బతుకులు భారంగా మారాయి. అధునాతన యంత్రాలతో మగువలను ఆకర్షించే రీతిలో కార్పొరేట్ సంస్థలు ఆభరణాలు తయారు చేస్తుండటం స్థానిక స్వర్ణకారుల ఉపాధికి గండి కొడుతోంది. ఒకప్పుడు ఆభరణాల తయారీకి స్వర్ణకారుల వద్దకు క్యూ కట్టే ప్రజలు నేడు రెడీమేడ్ దుకాణాల వైపు పరుగులు పెడుతున్నారు. దీంతో పెళ్లిళ్ల సీజన్‌లో కొందరు స్వర్ణకారులు తప్ప మిగతా పనుల్లేకుండా షాపుల ముందు ఖాళీగా కూర్చునే పరిస్థితి దాపురించింది. దీంతో పాత నగలు మరమ్మతులు చేసుకుంటూ కాలం గడుపుతున్నారు.

### పొరుగు రాష్ట్రాల కార్మికులతో పోటీ

రెడీమేడ్ నగల దుకాణాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి వలస వచ్చిన స్వర్ణకారులు స్థానికులకు పోటీగా మారారు. పశ్చిమబెంగాల్, బంగ్లాదేశ్ తదితర ప్రాంతాల నుంచి యంత్రాలపై ఆభరణాల తయారీలో నైపుణ్యంగల కార్మికులను దుకాణాల యాజమాన్యాలు, కార్పొరేట్ సంస్థలు తీసుకొస్తున్నాయి. దీంతో ఎన్నో ఏళ్ల నుంచి ఈ వృత్తినే నమ్ముకున్న స్వర్ణకారులకు పని లేకుండాపోతోంది. పనులు లేక పూట గడవని పరిస్థితుల్లో ఉన్నామని పలువురు స్వర్ణకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము పడుతున్న కష్టాలు తమ పిల్లలకు రాకూడదని వేరే వృత్తిలోకి పంపుతున్నట్లు పేర్కొన్నారు. కుటుంబజీవనం కోసం కొందరు బ్యాంకులు లేదా బంగారంపై అప్పు ఇచ్చే వ్యక్తుల వద్ద అప్రైజర్లుగా చేరిపోయారు.

### పెట్టుబడి ఏదీ?

అన్ని వృత్తుల మాదిరిగానే ఆభరణాల తయారీలో కూడా ఆధునికత పెరిగిపోయింది. ప్రతి చిన్న పని యంత్రాల సాయంతోనే చేయాల్సి వస్తోంది. కానీ వాటిని సమకూర్చుకునే స్తోమత లేని స్థానిక స్వర్ణకారులు చిన్నపాటి పరికరాలతోనే నెట్టుకొస్తున్నారు. కొద్దోగొప్పో డబ్బులు వెచ్చించి చిన్నపాటి యంత్రాలు కొందామన్నా ఎక్కువ మందికి ఆర్థిక పరిస్థితులు అనుకూలించడం లేదని చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 700 పైగా స్వర్ణకారులు ఉన్నట్లు తెలుస్తోంది. అన్నీ సామాజిక వర్గాలవారు ఈ వృత్తిలో జీవనం సాగిస్తున్నారు.

### రుణం ఇవ్వాలి: సుబ్బాచారి, స్వర్ణకారుడు

బంగారు ఆభరణాల తయారీ యంత్రాలు చాలు ఖరీదైనవి. కొనుక్కుని బతుకుదామంటే ఆర్థిక పరిస్థితులు సహకరించడం లేదు. ముద్రా రుణాలు మంజూరు చేయలని కోరుతున్నా బ్యాంకులు స్పందించడం లేదు. పూచీకత్తు లేనిదే రుణాలు ఇవ్వడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ వృత్తిలో ఎలా ముందుకు వెళ్లగలం. ప్రభుత్వం స్పందించి రుణాలు అందించాలి.

### బ్యాంకులో అప్రైజర్‌గా పని చేస్తున్నా: అరుణ్‌కుమార్, స్వర్ణకారుడు

బంగారానికి మెరుగులు దిద్ది ఆభరణాలు తయారు చేసే స్వర్ణకారుల జీవితాలు ప్రస్తుతం కళాహీనంగా మారాయి. కార్పొరేట్ షాపుల రాకతో రెడీమేడ్ నగలకు గిరాకీ పెరిగింది. ఒకప్పుడు ఆభరణాలు కావాలంటే ముందుగా ఆర్డర్లు ఇచ్చి ప్రత్యేకంగా చేయించేవారు. చేతినిండా పని ఉండేది. ఆదాయమూ బాగుండేది. ప్రస్తుతం యంత్రాలతో చేసిన ఆభరణాలకు డిమాండ్ పెరిగింది.

### కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్


ఆధునిక యంత్ర సామగ్రి లేకపోవడంతో స్వర్ణకారులు వృత్తిలో నైపుణ్యం సాధించలేకపోతున్నారు. నగల తయారీలో వాడే రసాయనాలు ఆరోగ్యాన్ని పాడు చేస్తున్నాయి. వ్యాపారం, వృత్తిలో నైపుణ్యం పెంచుకునేందుకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి. అసంఘటిత కార్మికులుగా గుర్తించి హెల్త్‌కార్డులు మంజూరు చేయాలి.

## ఈ-శ్రమ్‌పై అవగాహన ఏదీ?

**ఉచిత ప్రమాద బీమా పథకానికి అరకొర స్పందన**

**అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం**

**లబ్ధి కోల్పోతున్న అసంఘటిత కార్మికులు**




ఈ శ్రామ్ కార్డు (ఫైల్)

కొత్తచెరువు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అసంఘటిత కార్మికుల కోసం అమలు చేస్తున్న ఉచిత బీమా పథకం ఈ-శ్రమ్. ఈ కార్డు పొందడం ద్వారా లబ్ధిదారులకు అనేక ప్రయోజనాలు చేకూరుతాయి. అయితే దీని గురించి సరైన ప్రచారం లేకపోవడంతో అనేకమంది ఈ పథకానికి దూరంగా ఉన్నారు. ఈ-శ్రమ్ కార్డు ఉన్న వారికి ఉచితంగా రూ. రెండు లక్షల ప్రమాద బీమా లభిస్తుంది. అలాగే పనిముట్లు, కుట్టుమిషన్లు, వారి పిల్లలకు ఉచితంగా సైకిళ్లు ప్రభుత్వం నుంచి అందుతాయి. అయినా కార్మికులు ఈ పథకాల వైపు మక్కువచూపక పోవడానికి ప్రధాన కారణం అవగాహన లేకపోవడమే.

### అర్హులు వీరే

పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, రోజువారి కూలీలు, వీధి వ్యాపారులు, భవన నిర్మాణ కార్మికులు, ఉపాధి కూలీలు, రైతు కూలీలు, తక్కువ వేతనం అనగా రూ.15వేల లోపు ఉన్న కార్మికులు, పీఎఫ్, ఈఎస్ఐ, ఆదాయపు పన్ను చెల్లించని వారు అర్హులని జిల్లా లేబర్ అధికారి సూర్యనారాయణ తెలిపారు. ఈ-శ్రమ్ కార్డుకు దరఖాస్తు చేసుకునే వారికి 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలి. రేషన్, ఆధార్ కార్డును ఈ-శ్రమ్ కార్డుతో అనుసంధానం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని కార్మిక సంక్షేమశాఖ అధికారులు చెబుతున్నారు.

### దరఖాస్తు ఇలా..

- ఈ శ్రమ్ కార్డు పొందడానికి మొదట ఆధార్‌కార్డుకు మొబైల్ నంబర్ లింకై ఉండాలి.
- గ్రామ, వార్డు సచివాలయాలు, ఇంటర్‌నెట్ సెంటర్, మీసేవ సెంటర్, సీఎస్‌సీ సెంటర్లల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేయగానే మొబైల్‌కు వచ్చే ఓటీపీ నంబర్‌ని ఎంటర్‌చేసి లాగిన్ అవ్వాల్సి ఉంటుంది.
- తర్వాత చిరునామా, విద్యార్హత, ఏ పనిలో నైపుణ్యం ఉంది, పని స్వభావంతో పాటు, బ్యాంకు అకౌంట్ తదితర వివరాలు నమోదు చేయాలి.
- చివరగా ధ్రువీకరణ కోసం మొబైల్‌కు వచ్చిన ఓటీపీని నమోదు చేయాలి. అనంతరం 12 అంకెలు గుర్తింపు కార్డు మంజూరవుతుంది. తర్వాత మంజూరైన కార్డును కార్మికులు డౌన్‌లోడ్ చేసుకొని భద్రపరుచుకోవాలి.

### ప్రయోజనాలు ఇవే...

అసంఘటిత కార్మికులు ప్రమాదశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి రూ.2 లక్షల బీమా అందజేస్తారు. అలాగే శాశ్వత వైకల్యం పొందితే రూ. లక్ష వరకు అందుతుంది. పీఎం ఆవాస్ యోజన కింద ఉచిత గృహ నిర్మాణానికి రూ.1.2 లక్షలు, 60 సంవత్సరాలు నిండిన కార్మికులకు పీఎం శ్రమయోగి మాన్‌ధన్ యోజన కింద నెలకు రూ.3 వేల పెన్షన్ అందుతుంది. అర్హత కల్గిన కార్మికుల పిల్లలకు విద్య, వివాహానికి సాయం అందుతుంది. హెల్త్ కేర్ కింద అర్హత కలిగిన కార్మికులకు ఆయుష్మాన్ భారత్ పథకం కింద ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సాయం లభిస్తుంది. స్కిల్ డెవలప్‌మెంట్, ఉపాధి కింద పీఎం కౌశల్ వికాస్ యోజన కింద శిక్షణని అందించడంతో పాటు నెలకు రూ.8 వేల వరకు స్టైఫండ్‌నుకూడా ప్రభుత్వమే అందిస్తుంది.

### అవగాహన కల్పిస్తున్నాం



కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ- శ్రమ్ కార్డు, లేబర్‌కార్డులపై కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మికులు, ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్నాం. జిల్లాలో 3 లక్షల వరకు అసంఘటిత కార్మికులు ఉన్నారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 64,100 మందికి ఈ శ్రమ్ కార్డులను అందజేశాం.

\- సూర్యనారాయణ, జిల్లా కార్మిక శాఖ అధికారి

## నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కె.శే. శంకరనారాయణ కాంప్...

### దువ్వూరి రామిరెడ్డి (జయంతి)



'కవికోకిల'గా పేరొందిన దువ్వూరి రామిరెడ్డి 1895 నవంబరు 9న నెల్లూరు జిల్లా గూడూరులో జన్మించారు. 23ఏళ్లకే ఎన్నో రచనలు చేశారు. స్వయంకృషితో అనేక భాషలలో పండితులు. పండితులచే 'సింహపురి సిరి'గా పేరొందారు. సంస్కృత, అరబిక్ భాషలనుంచి ఎన్నో పుస్తకాలను ఆంధ్రీకరించిన ఘనత ఆయనది. కవిగానే కాక విమర్శకులుగాను గుర్తింపు పొందారు. న్యాయవాదిగా, నాటక రచయితగా, 'చిత్ర నళీయం' సినిమా సృష్టికర్తగా బహుముఖ ప్రజ్ఞాశాలి. 'వన కుమారి' కావ్యం విజయనగర మహారాజు ఆస్థానంలో కావ్యస్పర్థలో ప్రథమస్థానంలో నిలిచింది. 1947 సెప్టెంబరు 11న కన్నుమూశారు.

### కాళీపట్నం రామారావు (జయంతి)




'కారా మాస్టారు'గా పిలవబడే 'కాళీపట్నం రామారావు' 1924 నవంబరు 9న శ్రీకాకుళంలో జన్మించారు. సరళభాషా రచయిత, కథకుడు, విమర్శకుడు. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. 2వేలకుపైగా కథల సంపుటాలు రచించి తెలుగు కథకు శాశ్వతత్వాన్ని చేకూర్చే దిశగా విశేష కృషి చేశారు. ఆంధ్రభూమి దినపత్రికలో 'నేటి కథ' శీర్షికతో కొత్త రచయితలకు అవకాశం కల్పించారు. 1966లో 'యజ్ఞం' కథ పాఠకుల మన్ననలు పొందింది. కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు, ఎన్టీఆర్ జాతీయ పురస్కారం, ఇతర గౌరవాలు పొందారు. 2021 జూన్ 4న కన్నుమూశారు.

### బాలకృష్ణ ప్రసాద్ (జయంతి)



సంగీత విద్వాంసుడు గరిమెళ్ళ బాలకృష్ణప్రసాద్ 1948 నవంబరు 9న రాజమండ్రిలో జన్మించారు. గాయకుడిగా, కంపోజర్‌గా రాణించారు. 1978-2006 వరకు టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టులో స్పెషల్ గ్రేడ్స్ కళాకారుడిగా కొనసాగారు. 800కుపైగా అన్నమాచార్య కీర్తనలకు స్వరకల్పన చేశారు. కాగా ఇతరుల కవులు రాసిన సుమారు 1200 పాటలకు ట్యూన్స్ అందించారు. టీటీడీ, కంచికామకోటి పీఠం ఆస్థాన విద్వాన్‌గా రాణించారు. కర్ణాటక సంగీతం, లలిత సంగీతం, జానపద సంగీతంలో నిష్ణాతులు. సంగీత నాటక అకాడమీ, అన్నమయ్య నాదజ్యోతి, ఉగాది పురస్కారం ఇతర గౌరవాలు అందుకున్నారు. 2025 మార్చి 9న కన్నుమూశారు.

### శంకర్‌నాగ్ (జయంతి)



శాండల్‌వుడ్‌లో పేరొందిన నటుడు శంకర్‌నాగ్ (శంకర్ నాగరకట్టె) 1954 నవంబరు 9న ఉత్తరకన్నడ జిల్లా హొన్నావర తాలూకా మల్లాపురలో జన్మించారు. స్క్రీన్‌రైటర్‌గా, దర్శకుడిగా, నిర్మాతగా రాణించారు. బుల్లితెరపై ఆయన దర్శకత్వం వహించి నటించిన 'మాల్గుడి డేస్' ధారావాహిక ఎంతో పేరొందింది. అన్న అనంత్‌నాగ్‌తో కలసి నాటక, సినీరంగానికి ఎంతో కృషి చేశారు. 90కుపైగా సినిమాల్లో నటించారు. ఉత్తమ నటుడు అవార్డు గ్రహీత. కారు ప్రమాదంలో 1990 సెప్టెంబరు 30న దుర్మరణం చెందడం విషాదకరం.

### ఆర్ వేదవల్లి (పుట్టినరోజు)



సంగీత కళానిధి, విదూషి ఆర్ వేదవల్లి 1935 నవంబరు 9న తమిళనాడు రాష్ట్రం మన్నార్ గుడిలో జన్మించారు. కర్ణాటక శాస్త్రీయ సంగీతాలాపనలో పేరొందారు. తిరుప్పావై, ప్రమాణం వంటి ఆల్బమ్స్ ఎంతో పేరొందాయి. ఆలిండియా రేడియోలో క్లాజికల్ మ్యూజిక్, లైట్ క్లాజికల్ మ్యూజిక్‌లో ప్రెసిడెంట్ అవార్డు పొందారు. మద్రాస్ మ్యూజిక్ అకాడమీలోనూ, ప్రభుత్వ సంగీత కళాశాలలోనూ బోధనలు చేశారు. సంగీత కళా శిఖామణి, దివ్యగాన ప్రవీణ, కళైమామణి, సంగీత చూడామణి తదితర పురస్కారాలు అందుకున్నారు.

### వీణా గాయత్రి (పుట్టినరోజు)



తమిళనాడు మ్యూజిక్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీకి తొలి వైస్ చాన్స్‌లర్‌గా వ్యవహరించిన వీణా గాయత్రి 1959 నవంబరు 9న చెన్నైలో జన్మించారు. అసలు పేరు ఎచ్చంపాటి గాయత్రి. కర్ణాటక సంగీతంలో వీణావాదనలో పేరొందారు. ఆలిండియా రేడియోలో 13ఏళ్లకే సీనియర్ గ్రేడ్ గుర్తింపు పొందారు. దేశ విదేశాలలో కచేరీలు నిర్వహించారు. పలు ఆల్బమ్స్ రూపొందించారు. కళైమామణి, సంగీత కళా సారథి, సంగీత కళా శిఖామణి, జీవిత సాఫల్య పురస్కారం, మధ్యప్రదేశ్ ప్రభుత్వంచే కుమార గంధర్వ అవార్డు, ఇంకా గౌరవ డాక్టరేట్ తదితర పురస్కారాలు పొందారు.

## ఎస్సీ, ఎస్టీ చట్టాల పై అవగాహన కల్పించాలి : డీసీ



మాట్లాడుతున్న డీసీ నాగేంద్ర ప్రసాద్

బళ్లారి సిటీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల అట్రాసిటీ నిరోధక చట్టం పై అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పించాలని బళ్లారి డీసీ నాగేంద్ర ప్రసాద్ అధికారులకు సూచించారు. నూతన జిల్లా పరిపాలన భవనంలో శుక్రవారం నిర్వహించిన షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల పై అత్యాచారాల, దౌర్జన్యాల నియంత్రించేందుకు అవగాహనకు జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి మహమ్మద్ హారిస్ సుమేర్, ఏఎస్పీ నవీన్ కుమార్, సెక్రటరీ శశికాంత్ శివపురేరులు పాల్గొన్నారు.



ఘంటంవారిపల్లి హైస్కూల్‌లో కనకదాస జయంతి



దొమ్మసంద్ర గ్రామపంచాయతీ కార్యాలయంలో

# సమాజం కోసం పాటుపడిన కనకదాస

### జయంతి వేడుకల్లో ప్రముఖులు

బంగారపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కులం కులం అంటూ పిచ్చి భ్రమలో ఉండవద్దని సమాజంలోని మూఢ నమ్మకాలు, కుల వ్యవస్థలోని వ్యతిరేక విధానాలను ఖండిస్తూ సమాజం కోసం పాటుపడిన మహనీయుడు కనకదాసు అని ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి పేర్కొన్నారు. పట్టణంలోని పురసభ ఆవరణలో తాలూకా యంత్రాంగం, కర్ణాటక ప్రదేశ కురుబ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటైన కనకదాసు జయంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కనకదాసు కేవలం ఒక వర్గానికే పరిమితం కాదన్నారు. కార్యక్రమంలో పురసభ అధ్యక్షుడు గోవింద, బూడా అధ్యక్షుడు ఆర్ మునిరాజు, రామకృష్ణప్ప, కురుబసంఘం రాష్ట్ర కార్యదర్శి అప్పేగౌడ, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

**గ్రామ పంచాయతీలో**

దొమ్మసంద్ర: ఆనేకల్ తాలూకా దొమ్మసంద్ర గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం కనకదాస 538వ జయంతి జరిగింది. గ్రామపంచాయతీ ఆవరణలో కనకదాసు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. పీడీఓ జ్యోతి, కార్యదర్శి మంజునాథరెడ్డి, శివానంద్, సభ్యులు కే సురేశ్, రాజణ్ణ, పౌరకార్మికులు ఆంజినప్ప, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### మహనీయుడు కనకదాస

బాగేపల్లి: సమాజంలో అందరినీ సమాన దృష్టితో చూడాలని చాటిచెప్పిన మహనీయుడు కనకదాసు అని ప్రధానోపాధ్యాయురాలు రామసుబ్బమ్మ తెలిపారు. తాలూకాలోని ఘంటంవారిపల్లిలోని ప్రభుత్వ హైస్కూల్‌లో శనివారం ఏర్పాటైన కనకదాస జయంతి సందర్భంగా కనకదాసు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ సమాజంలోని మూఢనమ్మకాలను, దారి తప్పిన కుల కట్టుబాట్లకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. ఆయన కేవలం ఒక వర్గానికి పరిమితం కాలేదన్నారు. రచనలు, కావ్యాల ద్వారా ప్రజలను చైతన్యం చేశారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**విజయపురలో..**

విజయపుర: దేవనహళ్ళి తాలూకా విజయపుర పురసభ కార్యాలయంలో శనివారం కనకదాస జయంతి జరిగింది. పురసభ అధ్యక్షురాలు భవ్యమహేశ్ ముఖ్యులుగా పాల్గొన్నారు. పురసభ ఉపాధ్యక్షులు ఆయేష మహబూబ్‌పాషా, పురసభ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



బంగారపేటలో కనకదాస జయంతిలో ఎమ్మెల్యే తదితరులు



విజయపుర పురసభ కార్యాలయంలో...



కనకశ్రీ పురస్కార గ్రహీతలతో సీఎం సిద్ధరామయ్య

## కనకదాస భక్తుడే కాదు.. దార్శనికుడు : సీఎం

(5వపేజీ తరువాయి)కనకదాసు అంటే కేవలం ఒక వ్యక్తి కాదని అది ఓ పరంపర అన్నారు. కనకదాసును పిలిచే సందర్భంలో బుద్ధ, బసవ, కనకగా పిలుస్తారన్నారు. సాయంత్రం రవీంద్రకళాక్షేత్రలో కన్నడ సంస్కృతిశాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సాధకులకు కనకశ్రీ పురస్కారాలను ప్రదానం చేశారు. మంత్రి శివరాజ్ తంగడగితోపాటు పలువురు పాల్గొన్నారు.

## అధునాతన శస్త్ర చికిత్సపై అవగాహన



మీడియాతో వైద్యబృందం

బెంగళూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్లెనిగల్స్ బీజీఎస్ ఆసుపత్రిలో స్పైన్ ఆరోగ్యం - మినిమల్ ఇన్‌వాసివ్ సర్జరీ అనే అంశంపై ప్రత్యేక అవగాహన కల్పించారు. సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ నవీన్ మండ్య అప్పాజిగౌడ నేతృత్వంలోని బృందం మీడియాకు వివరాలు వెల్లడించారు. మినిమల్ ఇన్వాసివ్ విధానం ద్వారా స్పైన్ అండ్ న్యూరోసర్జరీలో తక్కువ నొప్పి, రక్తస్రావం ఉంటుందని తద్వారా రోగి త్వరగా కోలుకుంటారన్నారు. వైద్యంలోనూ సాంకేతిక విధానాలు వస్తున్నాయని అవి సాధ్యమైనమేరకు పాటించడం ద్వారా రోగికి ప్రయోజనం కలుగుతుందన్నారు. మీడియా సమావేశంలో డాక్టర్ కేశవ్, డాక్టర్ భరత్‌నాయక్, చీఫ్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ బాబు, క్లస్టర్ హెడ్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

# 5 కేసుల్లో రూ.కోటి విలువైన సామగ్రి స్వాధీనం

### కార్యాచరణలో పాల్గొన్న సిబ్బందికి ప్రశంసలు



స్వాధీనం చేసుకున్న నగలు, శ్రీగంధం దుంగలతో పోలీసులు

ముళబాగిలు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ముళబాగిలు ఉపవిభాగం పోలీసులు ఐదు కేసులలో సుమారు 1కోటి రూపాయల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశారు. కార్యాచరణలో పాల్గొన్న ముళబాగిలు రూరల్, శ్రీనివాసపుర, రాయల్పాడు పోలీసు అధికారులు, సిబ్బంది కార్యవైఖరిని ఎస్పీ బీ నిఖిల్ అభినందించారు. పట్టణ శివారులోని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం మీడియాతో మాట్లాడారు. పండుగల వేళ విధులు, బందోబస్తు నడు కూడా ఒక నెలలో 3 పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఐదు వేర్వేరు కేసులను చేధించడం అభినందనీయమన్నారు. కేసుల పరిష్కారానికి ప్రత్యేక బృందాలు నిందితులపై నిఘా వహించాయన్నారు. ముళబాగిలు తాలూకా మండికల్ గ్రామానికి చెందిన పురుషోత్తమరెడ్డి అనే నిందితుడిని శ్రీనివాసపుర తాలూకా రాయల్పాడు పోలీసులు అరెస్టు చేసి సుమారు 70లక్షల విలువైన 10 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారన్నారు. గౌనిపల్లి సీఐ శివకుమార్, రాయల్పాడు ఎస్సై రామ, సిబ్బంది కార్యాచరణలో పాల్గొన్నారన్నారు. ముళబాగిలు రూరల్, నంగలి, కోలారు వేమగల్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని పొలాల్లో శ్రీగంధం చెట్లను చోరీకి పాల్పడిన ముఠాను అరెస్టు చేశారన్నారు. సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్ తోటకానం పంచాయతీ కోటబండకు చెందిన వీ అరుణ్ (25), వీ సుబ్రమణి (28)లను అరెస్టు చేసి 105 కేజీల శ్రీగంధం దుంగలను, ఒక డియో ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారన్నారు. కాగా శ్రీనివాసపుర స్టేషన్ పరిధిలోని 3 వేర్వేరు కేసులలో రూ.20లక్షల విలువైన 171 గ్రాముల నగలను రికవరీ చేశారన్నారు. నలుగురు నిందితులను అరెస్టు చేశారన్నారు. కేసులను వేగిరంగా పరిష్కరించిన పోలీసు సిబ్బందికి నగదు బహుమతులు పంపిణీ చేశారు.

## 'మేయర్ పదవిని ఎస్సీలకు కేటాయించాలి'



విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్ హెగ్డే

బళ్లారి సిటీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలో మున్సిపల్ కార్పోరేషన్ స్థాపించిన నాటి నుంచి మేయర్ పదవిని ఎస్సీలకు కేటాయించలదేని, ఈ సారైనా దళితులకు అవకాశం ఇవ్వాలని పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని పత్రికా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నవంబరు 15న జరగనున్న మేయర్ ఎన్నికల్లో కనీసం ఈసారి అయినా ఎడమచేతి వాటం సామాజిక వర్గానికి మేయర్ అయ్యే అవకాశం కల్పించాలని ఎడమ చేతి దళిత సామాజిక వర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్‌పార్టీ నాయకులను డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో వెంకటేశ్‌హెగ్డే , ఎరుకుల స్వామి మాట్లాడుతూ మేయర్, డిప్యూటీ మేయర్ స్థానాలు పదవులు జనరల్ అభ్యర్థులకు రిజర్వ్ చేయబడ్డాయి. జనరల్ అభ్యర్థులు ఇప్పటికే చాలాసార్లు ఈ పదవులు అనుభవించారాన్నారు. దీని దృష్టిలో ఉంచుకుని పార్టీ నాయకులు ఎడమచేతి వాటం సామాజిక వర్గానికి అవకాశం ఇవ్వడం ద్వారా కొత్త చరిత్రను రాయాలన్నారు. మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని బళ్లారి నగరం ,బళ్లారి గ్రామీణ అసెంబ్లీ నియోజకవర్గాలలో సుమారు 80వేల మంది ఓటర్లు ఉన్నారు. ఈ ఓట్లు ఎక్కువగా కాంగ్రెస్ పార్టీకి శాశ్వత ఓట్లు ఉన్నాయి. నాయకులు దీనిని గ్రహించాలన్నారు. విలేకరుల సమావేశంలో హుస్సేనప్ప, వీరేంద్రకుమార్, ఆనంద్, గౌతమ్, బుజ్జి, పృథ్వీ, రవికుమార్, వీరేశ్ తదితరులున్నారు.

## వైద్యులను నియమించాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సామాజికవేత్త వసంతకాలే

కంప్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కంప్లి సముదాయ ఆస్పత్రిలో స్త్రీ రోగ వైద్యులను ఈ నెల 12లోగా నియమించకపోతే ఆస్పత్రి ముందు భాగంలో నిరసనలు చేపడతామని వసంత కాలే తెలిపారు. ఈ శనివారం ప్రభుత్వ అతిథి గృహంలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రికి సరైనన వైద్యులు లేక సుమారు 30 గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. కనుక జిల్లా ఆరోగ్య అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు ఇబ్బందులు దృష్టిలో వుంచుకుని వెంటనే డాక్టర్‌ను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మర్రిస్వామి, లక్ష్మణ్, రవి, బసవరాజు, రాజాబక్షి, సన్నీ మురుగేష్, బసవ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ

బళ్లారిరూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలో పలు అభివృద్ధి పనులకు సిటీ ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి శనివారం భూమిపూజ చేపట్టారు. నగరంలోని 35వ వార్డు ఇందిరానగర్ ఒకటి, రెండు అంగన్‌వాడీ కేంద్ర కట్టడ నిర్మాణానికి రూ. 40 లక్షల వ్యవయంతో నిర్మించనున్న పనులను ఆయ ప్రారంభించారు. 37వ వార్డు సమీపంలో మారుతినగర్, బసవనకుంట ఏరియాలో అంగన్‌వాడీ, 23వ వార్డు మహానంది కొట్టం సీసీ రోడ్డు పనులకు రూ. కోటి నిధులతో స్థానిక కార్పొరేటర్ గాదెప్ప నేతృత్వంలో వివిధ అభివృద్ధి పనులకు పెద్దఎత్తున అభివృద్ధి పనులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రముఖులు శ్రీధర్ గౌతమ్ గోవిందు విజయ్ మాజీ మేయర్ రాజేశ్వరి మించు శ్రీనివాస్, నూర్ మహమ్మద్, ప్రభంజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి

## విశ్రాంత ఉపాధ్యాయుడిపై దొంగల దాడి

### రూ.25 లక్షల బంగారం, రూ.15 లక్షల నగదు చోరీ

పావగడ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీచర్స్‌కాలనీలో నివసిస్తున్న యోగా గురువు, విశ్రాంత ఉపాధ్యాయుడు అంతరగంగ శంకరప్పపై దొంగలు దాడిచేసి గాయపరిచారు. ఇంటిలో ఉన్న రూ.25లక్షల విలువచేసే బంగారు, రూ. 15 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. తన కుమారుడి పెళ్లికోసం బంగారు, నగదును ఆయన సమకూర్చి ఇంటిలో ఉంచారు. అయితే రాత్రి దొంగలు ఇంటిలోకి చొరబడి రాడ్‌తో అతడి తలపై కొట్టి బంగారు, నగదును ఎత్తుకెళ్లారు. అపస్మారక స్థితిలో ఉన్న భర్తను చూసి భార్య గట్టిగా అరవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. బాధితుడి పరిస్థితి విషమించడంతో తుమకూరు ఆసుపత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు. కాగా పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మూడు నెలల వ్యవధిలో 40 దొంగతనాలు జరిగినా ఒక్క కేసును కూడా పోలీసులు చేధించలేదని, ఇది వారి నిర్లక్ష్యానికి అద్దంపడుతుందని అంగన్‌వాడీ టీచర్ సుశీలమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు.



శంకరప్పను తుమకూరు ఆసుపత్రికి తరలిస్తున్న బంధువులు

## వీరాంజనేయస్వామికి విశేష పూజలు



వీరాంజనేయస్వామికి అలంకరణ

శిడ్లఘట్ట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం శనివారం పురస్కరించుకుని పట్టణంలోని చింతామణి రోడ్డులో కొలువైన యోగి నారేయణ యతీంద్రనగర్‌లోని వీరాంజనేయస్వామికి విశేషపూజలు నిర్వహించారు. బలిజ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్యక్రమాలను పర్యవేక్షించారు. కార్తీకమాసం నెలపొడవునా ప్రతిరోజూ స్వామివారికి అభిషేకం, అలంకరణ ఉన్నాయని, ఒక్కోరోజు ఒక్కో సేవాకర్త పాల్గొంటారన్నారు. ఒక్కోరోజు నలుగురైదుగురు సేవాకర్తలు ఉంటారు. ధూపదీప నైవేద్యాలు, మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కైవార నారేయణ తాతయ్యకు కూడా విశేషపూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## బంగారు గొలుసు కోసం వృద్ధురాలి హత్య

(5వ పేజీ తరువాయి) భద్రమ్మ కనిపించడం లేదు. దీంతో కుటుంబీకులు ఆమెకోసం గాలింపు చేపట్టారు. అక్టోబరు 31న సర్జాపుర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నవంబరు 6న పోలీసు దర్యాప్తు బృందానికి సమాచారం అందింది. విచారణలో చివరగా వృద్ధురాలు సమీపంలోని దీపా ఇంటికి వెళ్లినట్లు గుర్తించారు. దీంతో పోలీసులు తమదైన శైలిలో ఆమెను విచారించారు. భద్రమ్మ వద్ద ఉండే బంగారు గొలుసుకోసం హతమార్చినట్లు అంగీకరించింది. మృతదేహాన్ని ఒక సంచిలో కట్టి ఇంట్లోనే ఉంచుకుంది. రెండు రోజుల తర్వాత దుర్వాసన అధికం కావడంతో మరోసంచిలో వేసి కుమారుడి సాయంతో దొడ్డతిమ్మసంద్ర చెరువు ప్రదేశంలో పడేసినట్లు నిందితురాలు తెలిపింది. తర్వాత ఏమీ తెలియనట్లు నటించారన్నారు. సర్జాపుర సీఐ నవీన్‌కుమార్ నేతృత్వంలో కేసును ఛేదించారు. . మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి తదుపరి దర్యాప్తు చేపట్టారు.



నిందితురాలు దీపా





కనకదాసకు పూజలు నిర్వహిస్తున్న వాణిజ్య మండలి సభ్యులు


కంప్లి తహసీల్దార్ కార్యాలయంలో..


సోమసముద్రంలో డోలు వాయిస్తున్న మాజీ ఎమ్మెల్యే సురేష్ బాబు..


దేవలాపురంలో కనకదాస విగ్రహం వద్ద..

# కనకదాస మహాజ్ఞాని

● జిల్లా వాణిజ్య , పరిశ్రమల మండలి అధ్యక్షుడు మంజునాథ్ ● వాడవాడలా జయంతి వేడుకలు

బళ్లారి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కనకదాస మహా గొప్పజ్ఞాని అని బళ్లారి జిల్లా వాణిజ్య, పరిశ్రమల మండలి అధ్యక్షుడు మంజునాథ్ అన్నారు. కనకదాసు జయంతి సందర్భంగా బళ్లారి జిల్లా వాణిజ్య, పరిశ్రమల మండలిలో వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కనకదాసు చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో బుడా మాజీ అధ్యక్షుడు, ప్రముఖ వ్యాపార వేత పి. పాలన్న, మాట్లాడారు. కనకదాసు గొప్ప మనసున్న మహానుబావుడన్నారు. ఆయన మనస్సు పాలవలే స్వచ్ఛంగా ఉంటుందన్నారు. వీరితో పాటు సురేష్‌బాబు, ఎస్. దొడ్డనగౌడ, సొంతగిరిధర్, వి. రామచంద్ర, సీ.ఎస్ సత్యనారాయణ, టీ. శ్రీనివాసులు, నేకర్ నాగరాజు పాల్గొన్నారు.

### కంప్లిలో..

కంప్లి, (ఆంధ్రజ్యోతి) : ఆలుమత సమాజం వారు కనకదాసను ఆదర్శంగా తీసుకోవాలని తహసీల్దార్ మంజునాథ నాయక అన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో కనకదాసు జయంతిని ఘనంగా నిర్వహించుకున్నారు. కనకదాసు భావ చిత్రపటానికి పూలమాలలతో ముస్తాబు చేపట్టి పూజలు నిర్వహించారు. సోమసముద్రం గ్రామంలో కనకదాసు జయంతి కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే టీ సురేష్‌బాబు పాల్గొని ఊరేగింపు కార్యక్రమంలో డోలు కొడుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు. దేవలాపురం గ్రామంలో కనకదాసు జయంతిని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలుమత సమాజ పదాధికారులు పాల్గొన్నారు.

### సిరుగుప్పలో..

సిరుగుప్ప (ఆంధ్రజ్యోతి) : ఘనంగా భక్త కనకదాసు జయంతి వేడుకలు జరిగాయి. తాలుకాలోని తాలుకా పరిపాలనా, బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. కనకదాసు భావచిత్రపటాన్ని హైస్కూలు గ్రౌండ్ నుంచి ప్రధాన రహదారిలో తహసీల్దార్ కార్యాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. మేళతాళాలతో, డోలు ఢమరులతో, వివిధ నృత్య ప్రదర్శనలతో, కోలాటాలతో ఊరేగింపు కొనసాగింది. అనంతరం తాలుకా పంచాయతీ ఆవరణంలో వేదిక కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బీఎం నాగరాజు డోలు వాయించడం ద్వారా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. భక్తకనకదాసు చరిత్ర ఎంతో వుందని ఎమ్మెల్యే బీఎం నాగరాజు అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరు ఆయన తత్వ సిద్దాంతాలను పాటించాలని కోరారు. ఉపన్యాసకులు చంద్రశేఖర్ ఆయన జీవిత చరిత్రను వివరించారు. కురుబ సమాజం వారు ఆయన తత్వసిద్దాంతాలు తెలుసుకుని ముందడుగు వేయాలని ఆయన కోరారు. అదేవిధంగా జేడీఎస్ పార్టీ కార్యాలయంలో తాలుకా అధ్యక్షులు శివనారాయణ ఆధ్వర్యంలో కనకదాసు 538వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గౌసియా బేగమ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సతీష్, కొడ్లి మల్లికార్జున, దమ్మూరు సోమప్ప, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కరిబసప్ప, సమాజ సేవకులు అబ్దుల్ నబీ, బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ మల్లికార్జున, వాల్మీకి సంఘం అధ్యక్షులు నరసింహ నాయకవివిధ ప్రభుత్వ శాఖల అధికారులు కురుబ సమాజం ప్రముఖులు కంబ్లి మల్లికార్జున, హనుమేష, బసవరాజు, ప్రజలు పాల్గొన్నారు.

బళ్లారిరూరల్ (ఆంధ్రజ్యోతి) : బళ్లారి రూరల్ తాలుకాలోని పరమ దేవనహళ్లి గ్రామంలో భక్త కనకదాసు జయంతి సందర్భంగా భక్త కనకదాసు చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతిని ఘనంగా జటింగి రామేశ్వర స్కూలు కరెస్పాండెంట్ చంద్రమూర్తి కురుబ రామయ్య జట్టింగప్ప శివ కుమార్ కురుబ కుల బాంధవుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

### రాయచూరులో..

రాయచూరు (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ వాగ్గేయకారుడు భక్త కనకదాస 538వ జయంతిని నగరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గంజ్ సర్కిల్‌లోని కనకదాస విగ్రహానికి చిన్ననీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఎస్. భోసరాజు, ఎమ్మెల్సీ ఎ.వసంత్‌కుమార్, ఎమ్మెల్యేలు శివరాజ్ పాటీల్, దద్దల బసనగౌడలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కనకదాస చిత్రపటం ఊరేగింపును ప్రారంభించారు. ఈ సందర్భంగా కనకదాస చిత్రపటం ఊరేగింపు నగరంలోని ప్రధాన రహదారుల గుండా సాగి పండిత్ సిద్ధరామ్ జంబలదిన్ని రంగమందిరకు చేరింది. ఊరేగింపులో మహానగర పాలిక మేయర్ నరసమ్మ మాడగిరి, సీనియర్ సభ్యుడు జయణ్ణ, తదితరులు పాల్గొన్నారు.

### కనకదాస తత్వాలను ఆచరించాలి : డీసీ

15వ శతాబ్దంలో దాస పరంపరం కొనసాగిందని, కృష్ణదేవరాయ హయాంలో వారికి ఎంతో మన్నన లభించిందని జిల్లాధికారి నితీశ్ అన్నారు. స్థానిక పండిత్ సిద్దరామజంబలదిన్ని రంగమందిరంలో శనివారం జిల్లా యంత్రాంగం , జిల్లా పంచాయతీ రాయచూరు మహానగర పాలిక, కన్నడ సంస్కృతి శాఖ ఆద్వర్యంలో 538వ కనకదాస జయంతోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడిన డీసీ, ఉత్సవాలను వైభవంగా నిర్వహించడం వరకే సరిపెట్టుకోరాదు. దాసుల తత్వసారాన్ని కొంతమేరైన మనం జీవితంలో అలవరచుకోవాలని సూచించారు. దాసు జీవిత చరిత్ర విశేషాలను వెల్లడించారు.



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న డీసీ నితీశ్


రాయచూరులో మంత్రి ఎన్ఎస్ భోసరాజు


సిరుగుప్ప జేడీఎస్ కార్యాలయంలో


డోలు వాయించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగరాజ


పరమ దేవనహళ్లి గ్రామంలో..

# హోసూరు జోన్

## పాఠశాలలో వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

హోసూరు(కృష్ణగిరి), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా కావేరిపట్టణంలోని ప్రభుత్వ బాలుర హయ్యర్ సెకండరీ పాఠశాల ఆవరణలో (నలం కాకుం స్టాలిన్)అనే పథకం ద్వారా వైద్య శిబిరాన్ని శనివారం ఏర్పాటు చేశారు. పారిశుద్ధ కార్మికుల సంక్షేమ చైర్మన్ డాక్టర్ తిప్పంపట్టి వి ఆరుస్వామి, బర్గూరు ఎమ్మెల్యే మదియళగన్, జిల్లా రెవెన్యూ అధికారి సాధన కురళ్ స్వయంగా శిబిరంలో పాల్గొన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు కృష్ణగిరి జిల్లాలో శనివారాల్లో 3 శిబిరాలు 10 బ్లాక్‌లలో 3 శిబిరాలు, కార్పొరేషన్‌లో 3 శిబిరాలు, మొత్తం 33 వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. ఇప్పటి వరకు కృష్ణగిరి జిల్లాలో 14 నలం కాకుం స్టాలిన్ పథకం కింద వైద్య శిబిరాలు జరిగాయి. పారిశుద్య కార్మికులకు పూర్తి శారీరక పరీక్షలు చేశారు. పౌరకార్మికుల ఆరోగ్య దృష్ట్యా శిబిరం సాగింది. ముఖ్యమంత్రి స్వచ్ఛతా ఉద్యోగుల సంక్షేమ తరపున రూ.15 కోట్లు కేటాయించారు. దాని ఆధారంగా రూ.45 కోట్లు నిల్వ ఉంది. కార్యక్రమంలో జిల్లా ఆరోగ్య అధికారి రమేశ్‌కుమార్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ సత్యభామ, జిల్లా ఆది ద్రావిడ సంక్షేమ అధికారి శివకుమార్, జిల్లా జనరల్ మేనేజర్ వేల్మురుగన్, వికలాంగుల సంక్షేమ అధికారి మురుగేశన్, బ్లాక్ మెడికల్ అధికారి నిత్య, కావేరిపట్టణం పట్టణ పంచాయతీ చైర్మన్ హంసవేణి సెందిల్ కుమార్ పాల్గొన్నారు.

## ట్రాఫిక్ కంట్రోల్ బూత్ ప్రారంభం


ట్రాఫిక్ కంట్రోల్ బూత్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ తంగదురై

హోసూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): హోసూరులోని తళి రోడ్డులోని రామనాయకన సరస్సు పార్కు సమీపాన ఒక ప్రైవేట్ ఫ్యాక్టరీ సీఎస్ఆర్ భాగస్వామ్యంతో ట్రాఫిక్ బూత్‌ను ఎస్పీ తంగదురై ప్రారంభించారు. నగరంలో ప్రత్యేకించి వారాంతంలో ట్రాఫిక్ రద్దీ ఉండడంతో నియంత్రణకోసం ట్రాఫిక్ కంట్రోల్‌బూత్‌ను ఏర్పాటు చేసినట్టు ఎస్పీ తెలిపారు. చిల్డ్రన్స్ పార్క్‌కు వేలాది మంది వస్తుంటారు. నగరంలోని ప్రధాన రహదారి తళిరోడ్డు కూడా ఉండడంతో ఈ రహదారి డెంకణీకోట రోడ్డును కలుపుతోంది. రహదారి డెంకణకోట ఓల్డ్ ఏఎస్‌టీసీ హడ్కో, న్యూ ఏఎస్‌టీసీ వంటి ప్రాంతాలకు అనుసంధానించే ప్రాంతం, కాబట్టి ట్రాఫిక్ రద్దీని నియంత్రించడానికి, వాహనాలను క్లియర్ నియంత్రించడానికి ఇక్కడ ట్రాఫిక్ బూత్ ఏర్పాటు చేయబడింది. ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ ఒక ప్రైవేట్ కర్మాగారంలోని మహిళా హాస్టల్‌లో రహస్య కెమెరాను అమర్చిన ఒడిశాకు చెందిన యువమహిళా కార్మికురాలి ఇప్పటికే అరెస్టు చేశామన్నారు. ఈ కేసులో ప్రమేయం ఉన్న మరో కీలక నిందితుడిని అరెస్టు చేయడానికి వారు ఢిల్లీ వెళ్లి హోసూరుకు తీసుకొచ్చారు. అతనిపై దర్యాప్తు చేస్తున్నారు. అతను సోషల్ మీడియాలో అశ్లీల వీడియోలను షేర్ చేయలేదని తెలుస్తోంది. శనివారం సాయంత్రానికి అతడిని కోర్టులో హాజరుపరిచి జైలుకు పంపుతామని ఆయన తెలిపారు.

### ఆసుపత్రికి ప్రహరీ నిర్మించండి..

హోసూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): హోసూరు ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు హోసూరు జిల్లా ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రి చుట్టుకొలత గోడ కూలిపోయింది. గతంలో రోడ్డు విస్తరణ పనుల సమయంలో 8 నెలల క్రితం ప్రభుత్వ ఆసుపత్రి ఎడమ వైపున ఉన్న చుట్టుకొలత గోడ కూలిపోయింది. 80 మీటర్ల పొడవు 5 అడుగుల ఎత్తు ఉన్న ప్రహరీ గోడ కూలిపోయింది. దీంతో తాత్కాలికంగా తెర కట్టారు. ప్రజలు, కర్మాగారాల్లో కార్మికులు సహ వెయ్యి మందికి పైగా ప్రతిరోజూ ఆసుపత్రిని సందర్శిస్తారు. ఈ ఆసుపత్రిలో అత్యవసర విభాగం, సిద్ధ వైద్య విభాగం, ప్రసూతి విభాగం సహా అనేక విభాగాలు ఉన్నాయి. ఆసుపత్రి ప్రహరీ గోడ లేకపోవడంతో సురక్షితంగా లేదని విచారం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు ఆసుపత్రికి ప్రహరీ నిర్మించాలని కోరుతున్నారు.


కూలిపోయిన ప్రహరీ

# అన్ని తాలూకాల్లో కృషి సమాజ్ భవనాలు: మంత్రి చలువరాయ


కృషి సమాజ్ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

బళ్లారి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని తాలూకాల్లో కృషిక సమాజ్ భవనాలు నిర్మిస్తామని, రైతు సమస్యలపై ప్రభుత్వం చిత్తశుద్ధి ఉందని వ్యవసాయ శాఖ మంత్రి చలువరాయస్వామి అన్నారు. బళ్లారి జిల్లా కేంద్రంలోని పాత తాలూకా కార్యాలయం ఆవరణంలో 'కృషి సమాజ్' బళ్లారి యూనిట్ నూతన భవనం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి బళ్లారి నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్వాతంత్రం రాక ముందే కృషిక సమాజ్ ప్రారంభం అయ్యాయన్నారు. కష్టపడే రైతులకు కృష్టిక సమాజ్ అండగా ఉంటుందన్నారు. 36 తాలూకాల్లో కృషి క సమాజ్ కోసం నూతన భవనాలు ఏర్పాటు చేస్తామన్నారు.

### రైతు సంక్షేమమే లక్ష్యం : ఎమ్మెల్యే నారా



రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఇతర మంత్రులు రైతుల సంక్షేమం కోసమే కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి అన్నారు. దేశానికి అన్నం పెట్టే అన్నదాతను రక్షించుకోవడం. వారికి కావాల్సిన సబ్సిడీ పథకాలు, మద్దతు ధర. పంటల విక్రయాలకు కావాల్సిన మార్కెట్ సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. ఎంపీ తుకారాం మాట్లాడుతూ అఖండ బళ్లారి జిల్లాలోని 8తాలూకాల్లో ఎంపీ గ్రాంటు కింద రైతు కాంటాక్ట్ కేంద్రాలకు రెండు లక్షల విలువ చేసే అత్యాధునిక కంప్యూటర్లు, ప్రొజెక్టర్లను అందజేశామన్నారు. రైతులు శాస్త్రీయ పద్ధతిలో పంటలు పండించాలని కోరారు. అలాగే వ్యవసాయ పద్ధతులను అవలంబించడంపై శిక్షణ కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వానలకు పంటనష్టం అంచనావేసి నివేదిక ప్రభుత్వానికి ఇవ్వాలని అధికారులకు సూచించినట్లు ఎంపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ తోలు పరిశ్రమల అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు ముండ్రగి నాగరాజు, ప్రభుత్వ హామీ పథకాల అమలు అథారిటీ అధ్యక్షుడు కేఈ చిదానందప్ప, కృషికా సమాజ్ అధ్యక్షుడు గాదెప్ప, డీ.డీ అగ్రికల్చర్ మంజునాథ్, కార్పొరేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## చీటీ సొమ్ముతో మహిళ ఉడాయింపు.. బాధితుల లబోదిబో


పోలీస్ స్టేషన్ వద్ద బాధితులు

హోసూరు(క్రైం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంలోని దీపావళి చీటీ వేసి రూ. 2 కోట్లు కాజేసి పరారైన మహిళ కోసం గాలింపులు చేపట్టారు. చీటీ వేసినవారికి బంగారం, వెండి ఇస్తామని నమ్మకం కల్పించింది. మత్తిగిరి సమీపంలోని అచెట్టిపల్లిలో నివసించే పద్మ దీపావళీ చీటీ నిర్వహించేది. ఆమెకు హోసూరు, మత్తిగిరి, కురుబట్టి, పాత మత్తిగిరి, నవది, చుట్టు పరిసర ప్రాంతాల నుంచి 800కు పైగా ప్రజలు చీటీ వేశారు. 800 కు పైగా కార్డులను ప్రింట్ చేసి ఎవరైనా నెలకు 1500 చొప్పున 12 నెలల పాటు సీటు సరిగ్గా కట్టిన వారికి 2 గ్రాముల బంగారం, 20 గ్రాముల వెండి తోపాటు దీపావళి పండుగకు సరిపడే రేషన్ కూడా ఇస్తామని నమ్మించారు. రెండేళ్లుగా చీటీలు నిర్వహిస్తూ స్థానికుల విశ్వాసం పొందారు. ఇటీవల దీపావళికి 500మందికిపైగా నమోదు చేసుకున్నారు. అందరికీ ఈనెల 5న ఇస్తానని చెప్పి ఒక్కసారిగా కనిపించలేదు. ఆమె ఆచూకీ లేకపోవడంతో మోసపోయినట్టు గుర్తించి మత్తిగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుటుంబంతో అదృశ్యమైన పద్మపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## మద్దతు ధరతో మొక్కజొన్న కొనుగోలు చేయాలి

బళ్లారి సిటీ,నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మొక్కజొన్నకు రూ. 3వేలు ధరతో కొనుగలో చేయాలని ఏఐకేకేఎంఎస్ డిమాండ్ చేస్తూ శనివారం కృషిక సమాజ రాష్ట్ర అధ్యక్షుల ద్వారా వ్యవసాయ మంత్రికి వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు హనుమంతప్ప, జిల్లా సంఘం అధ్యక్షుడు గోవింద్ మాట్లాడుతూ రాష్ట్రంలోని బళ్లారితో సహా వివిధ జిల్లాల్లో మొక్కజొన్న పంటను పండిస్తారు. ఈ సారి మొక్కజొన్న పంట ధర గణనీయంగా తగ్గడం వల్ల రైతులు చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.కృషిక సమాజ్ ప్రభుత్వంతో చర్చించి మొక్కజొన్న పంటకు రూ. 3వేలు మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. రాష్ట్రంలో ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా వరితో సహా ఇతర పంటలు చాలా దెబ్బతిన్నాయి. వెంటనే పంట సర్వేను నిర్వహించాలన్నారు. వరికి రూ. 3500 మద్దతు ధర ఇవ్వాలి. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి గురల్లి రాజా, రైతు నాయకులు కల్లుకంబ పంపాపతి, తదితరులున్నారు.

### సీఎం సభకు బస్సుల మళ్లింపు

బళ్లారి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆదివారం విజయనగర జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో ఆర్టీసీ బస్సులను తరలించారు. సభకు ప్రజలను తరలించేందుకు బస్సులు తరలించినట్లు అధికారులు తెలిపారు. దాదాపు 165 బస్సులు తరలించినందును పలు రూట్లలో బస్సు సర్వీసులు రద్దు చేశారు. బళ్లారి, సిరుగుప్ప, టెక్కలకోట, కురుగోడ, కుడతిన్ని, కంప్లి, సండూరు ఏరియాకు తిరిగే బస్సులు ఎక్కువగా సీఎం సభకు వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఈరూట్లో బస్సులు ఆదివారం తిరగడం తగ్గిస్తామని తెలిపారు. ప్రయాణికులు గమనించాలని అధికారులు ప్రకటించారు.


హాకీ స్టేడియంలో క్రీడాకారులు

### నగరంలో హాకీ వందేళ్ల వేడుకలు

బళ్లారి సిటీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని జిల్లా హాకీ స్టేడియంలో 100 సంవత్సరాల హాకీ వేడుకలను శనివారం ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. క్రీడకు శతాబ్దాల అంకితభావం,సహకారాన్ని గుర్తించడానికి హాకీ బళ్లారి అసోసియేషన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఆటగాళ్ళు, కోచ్‌లు, హాకీ ఔత్సాహికులు పాల్గొన్నారు. ఇది బళ్లారిలో హాకీ యొక్క గొప్ప వారసత్వం,స్ఫూర్తిని గౌరవించడానికి ఒక చిరస్మరణీయ సందర్భమని హాకీ బళ్లారి అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ధ్యాన్‌చంద్ తదితర గొప్ప క్రీడాకారులను స్మరించుకున్నారు.

## బస్సుకింద పడి బాలుడి మృతి

● రెండు చేతులు విరిగి తమ్ముడికి తీవ్ర గాయాలు
● లింగసుగూరు బస్టాండ్‌లో ఘోర ఘటన

రాయచూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని లింగసుగూరు పట్టణం కేంద్రీయ బస్‌స్టాండ్‌లో శనివారం ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. బస్‌స్టాండ్ వద్ద నిలిచి ఉన్న ఇద్దరు అన్నదమ్ముల పై ఆర్టీసీ బస్సు దూసుకుపోవడంతో 12 ఏళ్ల బాలుడు సిద్ధరాయ అక్కడికక్కడే కన్ను మూశాడు. మరో 8 ఏళ్ల బాలుడు ధనంజయ్‌కు రెండు చేతులు విరిగిపోయి తీవ్ర గాయాల పాలైయ్యాడు. లింగసుగూరు పట్టణానికి చిందిన బసవరాజ్ వేరే ఊరుకు వెళ్తూ తన ఇద్దరు పిల్లలను బస్‌స్టాండ్ దగ్గర నిలిపి వేరే పని ఉందని ఇక్కడే ఆగి ఉండాలని వారికి చెప్పి వెళ్లాడు. తండ్రి కోసం ఎదురు చూస్తున్న ఇద్దరు చిన్నారులపైకి అకస్మాత్తుగా ఆర్టీసీ బస్సు దూసుకొచ్చింది. దీంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. కాగా బస్‌స్టాండ్ వద్దకు తీసుకొచ్చిన కుమారుల్లో ఒకరు దుర్మరణం పాలు కావడంతో ఆ తల్లిదండ్రుల ఆక్రందన చూపరులను కలిచివేసింది.

## పాముకాటుతో రైతు మృతి


మౌనేశ్(ఫైల్)

రాయచూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తన తోటలో పని చేసుకుంటున్న రైతు పాము కాటుకు గురై మృత్యువాతపడ్డారు. శుక్రవారం జిల్లాలోని దేవదుర్గ తాలూకా జాలహళ్ళి సమీపంలోని తింపూరు దొడ్డిలో రైతు మౌనేశ్(45) తన వ్యవసాయ తోటలో పని చేస్తుండగా సాయంత్రం పాముకాటుకు గురైయ్యాడు. జాలహళ్ళిలో ప్రాథమిక చికిత్సనందించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం మౌనేశ్‌ను జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు.

## డీకేశీ సీఎం కావాలని పూజలు


హోమం నిర్వహిస్తున్న బుడా అధ్యక్షుడు జేఎస్ ఆంజనేయులు

బళ్లారి రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరం తాళ్లూరు రోడ్డు బాలాజీ నగర్ క్యాంపులోని అమృతేశ్వర ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉయదం హోమం, అమృతేశ్వరుడికి అభిషేకం నిర్వహించారు. డీకే శివకుమార్ ముఖ్యమంత్రి కావాలని విశేష పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో కాంగ్రెస్ నాయులు పాల్గొన్నారు.


అలంకరణలో అమ్మవారు